క్లుప్తంగా

తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

కాజులూరు: గ్రామాల్లో తొలకరి పంట సాగు చేస్తున్న రైతులందరూ తప్పని సరిగా వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని గొల్లపాలెం రైతుసేవా కేంద్రం వీఏఏ వనుం రమ్య అన్నారు. బుధవారం గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది పంటల నమోదు పూర్తి చేశామన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలి ముద్రలు వేయడం లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు. ఈ-కేవైసీ లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

రాఖీలు కట్టిన ఓం శాంతి భక్తులు



గొల్లపాలెంలో రాఖీలు కడుతున్న ఓంశాంతి భక్తులు

కాజులూరు: మండల గ్రామాల్లో ఓంశాంతి భక్తులు నిర్వహించిన రాఖీ పండగ ప్రత్యేకత సంతరించుకుంది. రక్షబంధన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం, ఆర్యావటంలలో ఓంశాంతి భక్తులు బుధవారం ఇంటింటా పర్యటించి ఆడ, మగ అన్న భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ రాఖీలు కట్టారు. గొల్లపాలెంలో కాజులూరు ఓం శాంతి ఆశ్రమ నిర్వాహకురాలు బీకే రామలక్ష్మి మాట్లాడుతూ మనసా, వాచా, కర్మణా ప్రతి ఒక్కరూ పరమాత్ముడిపై మనస్సు లఘ్నం చేయగలిగితే చేతికి కట్టిన రాఖీ వలే ఎల్లప్పుడూ ఆయన ఆశీస్సులు మనకు ఉంటాయన్నారు.

అంగర ఎస్సైగా రవికుమార్



కపిలేశ్వరపురం: మండలంలోని అంగర ఎస్సైగా టి.రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం సీఐడీ విభాగం నుంచి బదిలీపై ఆయన అంగర ఎస్సైగా వచ్చారు. ఇప్పటి వరకూ అంగర ఎస్సైగా పనిచేసిన అందే పరదేశి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉన్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు. మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

మట్టి గణపయ్యలనే ప్రతిష్ఠించండి

మండపేట: ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ మట్టి గణపయ్య విగ్రహాలనే ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల 7న గణపతి నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయన్నారు. పట్టణంలోని యువకులు, గణపతి భక్తులు మట్టితో తయారు చేసిన గణనాథుని విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: కుయ్యేరు విద్యుత్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. మండలంలోని కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని దుగ్గుదుర్రు, దుగ్గుదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాల గృహావసర వినియోగదారులకు, కుయ్యేరు 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, పల్లిపాలెం, ఉప్పుమిల్లి గ్రామాల్లోని ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపోతుందన్నారు.

నేడు అన్నాయిపేటలో రంగా విగ్రహావిష్కరణ

రామచంద్రపురం రూరల్: మండలంలోనిన అన్నాయిపేటలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరుగుతుందన్నారు.

పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ పరిశీలన

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను బుధవారం అమలాపురం ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. హార్బర్‌లో అభివృద్ధి పనుల నిమిత్తం ఈ పరిశీలన చేసినట్టు సమాచారం. ఈ మేరకు హార్బర్ విస్తరించి ఉన్న ఏరియాను ఆర్డీవోకు రెవెన్యూ అధికారులు, సర్వేయర్ వివరించారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన ప్రతి ఒక్కరి మనస్సులను కలచివేసింది. అటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి. సమయంతో సంబంధం లేకుండా వైద్యులు రోగులకు సేవలందిస్తారు. రోగుల ప్రాణాలకే అధిక ప్రాధాన్యమిస్తాం. అటువంటి వైద్యులకు భద్రత లేకుంటే ఏ విధంగా వైద్యం అందిస్తారు. ప్రభుత్వాలు వైద్యుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

– డాక్టర్ కె.మణికంఠ, పీహెచ్‌సీ వైద్యాధికారి, మాచవరం, రాయవరం మండలం





వైద్యులకు భద్రత కల్పించాలి

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. సమాజం పట్ల వైద్యులు ఎంతో బాధ్యత కలిగి ఉంటారు. గతంలో వైద్యుల పట్ల సమాజం అంతే గౌరవంగా ఉండేది. అయితే రాను, రానూ వైద్యులపై కొందరు అగౌరవంగా ప్రవర్తిస్తున్నారు. అటువంటి వారిని నిర్లక్ష్యంగా వదలివేయటం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు వైద్యులపై ప్రజల్లో గౌరవాన్ని పెంపొందించాలి. ఎవరు తప్పుగా ప్రవర్తించిన వెంటనే శిక్షించేలా చట్టాలను కఠినం చేయాలి.

– సీహెచ్ శ్రీయ, వైద్యురాలు, గొల్లపాలెం పీహెచ్‌సీ

రైతుబజార్‌కు మోక్షమెప్పుడో?

- 28 షాపులతో నిర్మాణం
- ప్రారంభం కోసం ప్రజల ఎదురు చూపులు



పట్టణంలో నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు బజార్

రామచంద్రపురం: నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోకుండా పోయింది రైతు బజార్. ఎప్పుడు ప్రాంభం అవుతుందా అని పట్టణవాసులు ఎదురు చూస్తున్నారు. రామచంద్రపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, రైతులకు మేలు చేకూరుస్తూ మార్కెట్‌కు కూత వేటు దూరంలో గత ప్రభుత్వంలోని మంత్రి వేణుగోపాలకృష్ణ చొరవతో ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా ప్రస్తుతం పట్టణం నడిబొడ్డున రైతుబజార్ నిర్మాణం పూర్తి చేసుకుంది. ప్రారంభ సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో రైతు బజార్ ప్రారంభం నిలిచిపోయింది.

పురపాలక పరిధిలో సుమారుగా 50 వేల మంది జనాభా ఉండగా 17 వేల కుటుంబాల వారున్నారు. వీరితో పాటుగా నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలకు చెందిన వారు, పక్కన ఉన్న మండపేట నియోజకవర్గంలోని రాయవరం మండలం పసలపూడి, వెంటూరు, చెల్లూరు, నదురుబాద, మాచవరం, సోమేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు కూడా రామచంద్రపురం మార్కెట్‌కు వస్తుంటారు. నియోజకవర్గంలోని ద్రాక్షారామతో పాటుగా పట్టణంలోను కూరగాయాల కొనుగోళ్లకు వస్తుంటారు. అయితే ఎక్కడా లేని విధంగా పట్టణంలో కూరగాయల అధిక ధరలు ఉండేవి. దీంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మున్సిపాలిటీ స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. కానీ కాలక్రమేణా కూరగాయల దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడి రైతు బజార్‌ను నిర్వీర్యం చేశారు. గతంలో రైతు బజార్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరినా టీడీపీ హయాంలో అది నెరవేరలేదు.

రూ.కోటితో రైతుబజార్ నిర్మాణం

పట్టణంలో తిరిగి రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ రైతు బజార్‌లు ఏర్పాటు చేస్తుండగా అందులో భాగంగా అప్పటి మంత్రి వేణు చొరవతో రామచంద్రపురానికి ఒక రైతు బజార్‌ను మంజూరు చేసి రైతు బజార్ నిర్మించారు. 23వ వార్డులోని శివాలయం రోడ్డు నుంచి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఉత్తరం వైపున ఉన్న పురపాలక సంఘానికి చెందిన 1.48 ఎకరాల స్థలంలో 25 సెంట్ల స్థలాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వారికి కేటాయించి రైతు బజార్‌ను పూర్తి చేశారు. నిర్మాణం అయితే పూర్తయింది కానీ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. స్థానిక మంత్రి సుభాష్ రైతు బజార్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది

సుమారు రూ.80 లక్షలతో నిర్మాణాలు ప్రారంభించడం జరిగింది. సుమారు రూ.50 లక్షల వరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేసిన తరువాత కాంట్రాక్టర్ అప్పజెప్పిన తరువాత అక్కడ కార్యకలాపాలు ప్రారంభిస్తారు.

– పొత్తక వాసుదేవరావు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ

త్వరగా అందుబాటులోకి తేవాలి



అప్పటి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక కృషితో రామచంద్రపురం పట్టణంలో రైతు బజార్ నిర్మాణానికి అప్పటి జిల్లా కలెక్టర్, మంత్రి వేణుల చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం మిగిలి ఉన్న పనులు పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తెస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

– పందు గోవిందరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

డంపింగ్ యార్డు కోసం అఖిలపక్ష భేటీ



అంగరలో డంపింగ్ యార్డు ఏర్పాటుపై చర్చిస్తున్న అఖిలపక్ష నాయకులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు రాజకీయ పక్షాలన్నీ ఐక్యంగా కృషి చేయాలని ఆ గ్రామ అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. గ్రామంలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ మేరకు బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీల నాయకులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. నాయకులు మాట్లాడుతూ డంపింగ్ యార్డు లేక వ్యర్థాలను టేకి డ్రైన్ గట్టుపై డంప్ చేస్తున్నారన్నారు. దీంతో సమీపంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది, రోజూ దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని సమకూర్చుకునే విషయమై చర్చించారు. త్వరితగతిన ఈ మేరకు ఒక ప్రతిపాదనను అధికారులకు నివేదించేందుకు కృషి చేద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పిల్లా బసవరాజు, దాసరి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల బోధకుడు.. తెలుగు భాషా ప్రేమికుడు..



అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లాల చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న విస్సు మాస్టారు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: తింటే గారెలే తినాలి.. వింటే విస్సు మాస్టారి తెలుగు పాఠం వినాలి అనే రీతిలో ఆయన బోధన సాగుతుంది. ప్రస్తుతం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అరవ విస్సు మాస్టారుకు తెలుగు అంటే మమకారం ఎక్కువ. తాను పుట్టి పెరిగిన మగటపల్లి గ్రామంలో ఐదో తరగతి చదువుతుండగా తెలుగు ఉపాధ్యాయుడు ముంగండ నాగేశ్వరరావు మాస్టారు తెలుగు భాషపై అభిరుచి పెరిగేలా బోధించారు. ఆయన ప్రేరణతో 18 ఏళ్ల వయస్సులో 'ప్రాణం ఖరీదు' అనే కథను రచించి ప్రముఖ దినపత్రిక ఆంధ్రభూమికి పంపించారు. ఆ కథ నేటి కథ శీర్షికతో ప్రచురితమైంది. అక్కడి నుంచి అదే పత్రికలో సుమారు 60 కథల వరకు అదే శీర్షికతో ప్రచురితమయ్యాయి. ఈ శీర్షికను నిర్వహించిన ప్రముఖ సాహితీవేత్త కాళీపట్నం రామారావు(కారా) సామాజిక స్పృహతో ముడిపడిన కథలు అని ప్రశంసించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల నేపథ్యంలో కోనసీమ జిల్లా గురించి రాసిన కవితకు అప్పటి ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రకటించి అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాల చేతుల మీదుగా అందజేశారు. ప్రముఖ సంగీత సినీ దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ తన తండ్రి సత్యమూర్తి పేరున ఏర్పాటు చేసి ఫౌండేషన్ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. ఫౌండేషన్ కన్వీనర్ దేవీశ్రీ ప్రసాద్ సమయానుకూల పంచ్ డైలాగులు విస్సు మాస్టారి ప్రత్యేకత అని ప్రశంసించారు. అప్పట్లో లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి సమక్షంలో చెప్పిన పేరడీ పద్యం 'కోనసీమ చక్కని పాడి ఆవు' అనే పద్యాన్ని రాగయుక్తంగా పాడగా బాలయోగి అద్భుతంగా ఉందని ప్రశంసించారు. రాజోలులో జరిగే సాహితీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అప్పట్లో రచించిన ఉగాది కవితకు తనికెళ్ల భరణి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషపై మిక్కిలి మక్కువతో ఆంగ్ల ఉపాధ్యాయుడు అయినప్పటికీ ఈదరాడ, ద్రాక్షారామ ఉన్నత పాఠశాలలో తెలుగును బోధించారు. ద్రాక్షారామ నాటక కళాపరిషత్ నిర్వహించే నాటక పోటీలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ అనేక మంది ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ద్రాక్షారామ ఉన్నత పాఠశాలలో 2007లో అప్పటి ట్రైనీ కలెక్టర్ కిషోర్ కుమార్ సుమారు 45 నిమిషాలు ఆయన బోధిస్తున్న తరగతి గదిలో కూర్చుని పాఠం మొత్తం విని తాను ఐఏఎస్ ట్రైనింగ్‌లో పొందిన అనుభూతిని మీ బోధనలో పొందానని కితాబు ఇచ్చారు. టీటీడీ దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో వ్యాఖ్యాతగా చేసిన దానికి అప్పటి టీటీడీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ విస్సు మాస్టారు రచించిన 'అమ్మ' పాటను ఆవిష్కరించారు. అదే విధంగా 'మాస్టారు కథలు' శీర్షికతో ఉపాధ్యాయుల జీవితాలను ప్రతిబింబించే విధంగా సుమారు 30 కథలు ఆయన రచించారు. ఆయన రచించిన అనేక కథలు, కవితలు, గేయాలు వివిధ పత్రికల్లో ప్రచురితమై ప్రముఖుల ప్రశంశలు అందుకున్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక సాహితీ సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు ఆయనను ప్రత్యేకించి వక్తగా పిలుస్తుంటారు.

మాజీ సర్పంచ్ దోసారావుకు నివాళి



దోసారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక నేతలు

రాయవరం: సోమేశ్వరం గ్రామాభివృద్ధికి నిమ్మకాయల దోసారావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. సోమేశ్వరం మాజీ సర్పంచ్ దోసారావు ఎనిమిదో వర్ధంతిని బుధవారం నిర్వహించారు. సోమేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గల దోసారావు విగ్రహానికి ప్రస్తుత సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిబద్ధత కలిగిన నాయకుడిగా దోసారావు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారని వక్తలు కొనియాడారు. సర్పంచ్‌గా పని చేసిన సమయంలో దోసారావు గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని పలువురు పేర్కొన్నారు. అలాగే పేదల పట్ల దోసారావు చూపిన ఆదరాభిమానులు వారి హృదయాల్లో సుస్థిరంగా నిలిచి ఉంటాయన్నారు. తొలుతగా దోసారావు విగ్రహానికి సర్పంచ్ ఆరిఫ్‌తో పాటుగా, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోట వెంకట్రావు, నీటి సంఘం మాజీ డైరెక్టరు గరగ కామరాజు, కాపు సంఘం మండలశాఖ అధ్యక్షుడు నున్న వెంకటరమణ, స్థానిక నాయకుడు ఇనకోట ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం వేళ కరెంటు స్తంభాలను తాకొద్దు

ఏపీఈపీడీసీఎల్ ఈఈ విజయానంద్



ఈఈ విజయానంద్

మండపేట: వర్షాకాలంలో విద్యుత్ విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ వై.విజయానంద్ సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షం కురుస్తున్నపుడు విద్యుత్ స్తంభాలను, వైర్లను తాకరాదన్నారు. ఆ సమయంలో విద్యుత్ లైన్ల కింద నిలబడి ఉండకూడదన్నారు. గాలి వానలకు విద్యుత్ వైర్లు తెగిపడితే ఆ సమయంలో వాటి దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. తమకు గానీ, తమ సిబ్బంది గానీ తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టడం మంచిది కాదన్నారు. విద్యుత్ లైన్ల కింద నుంచి ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టరాదని సూచించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, తదితర ఫిర్యాదులు చేయడానికి 1912 కు ఫోన్ చేసి చెబితే సకాలంలో స్పందిస్తామని ఈఈ విజయానంద్ పేర్కొన్నారు.

1న కాపు ప్రజాప్రతినిధులకు సన్మానం

మండపేట: రాష్ట్రంలోని కాపు ప్రజానిధులకు సెప్టెంబర్ 1న మండపేటలో ఘన సన్మానం ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీ ఐక్య కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు వాదా ప్రసాదరావు తెలిపారు. స్థానిక గొల్లపుంత వీధిలోని తన నివాసం వద్ద బుధవారం ఆయన కాపు నాయకులు దేవు వెంకట్రాజు, గాదంశెట్టి కొండలరావులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మెయిన్ రోడ్డులోని బస్‌స్టాండ్ వద్ద గల సూర్యా కన్వెన్షన్ హాల్లో సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మీయ అభినందన సభ ప్రారంభమవుతుందన్నారు. ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాపులందరూ తరలి రావాలని ఆయన కోరారు.

హత్యాచార నిందితుల్ని కఠినంగా శిక్షించాలి



సోమేశ్వరంలో మానవహారంగా ఏర్పడిన స్కీమ్ వర్కర్లు

రాయవరం: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన ఘటనలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలంటూ మండలంలోని సోమేశ్వరం గ్రామంలో స్కీమ్ వర్కర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, పాఠశాల శానిటేషన్ ఆయాలు, మిడ్ డే మీల్ వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చట్టాలు ఎన్ని వస్తున్నా ఇలాంటి అఘాయిత్యాలు ఆగకపోవడం విచారకరమన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లనే రక్షించలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలన్నారు. అనంతరం ర్యాలీ చేసి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల నాయకులు అనంతలక్ష్మి, వి.చంద్రకళ, శానిటేషన్ ఆయాల నేత దుర్గాభవాని, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు ఎం.కమల, ఎస్.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం



ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న బాక్సులు చూపిస్తున్న విద్యార్థులు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: రుచిగా, శుభ్రంగా వడ్డించాల్సిన మధ్యాహ్న భోజనం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం పర్యవేక్షించాల్సిన ఉపాధ్యాయులు, మండల స్థాయి విద్యాశాఖ అధికారుల పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పేరుకు మాత్రంగా గొప్పగా ప్రకటనలు చేసుకోవడం తప్ప ఆచరణలో మాత్రం కానరావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలోని భట్లపాలికలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం గత కొన్ని నెలలుగా నాణ్యతగా లేకపోవడంతో పాటు పురుగులు ఉండడంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. తాజాగా బుధవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోరిక మేరకు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను, నిర్వాహకులను మధ్యాహ్న భోజన నిర్వహణ చూసి నివ్వెరపోయి హెచ్ఎంకు, విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. వెంటనే విద్యార్థులకు సరైన భోజనం పెట్టేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

అసలేం జరిగిందంటే..

గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 90 మంది విద్యను అభ్యసిస్తున్నారు. గత కొంత కాలంగా మధ్యాహ్న భోజనం విషయంలో అన్నం సరిగా ఉడకడం లేదని నాసిరకంగా నాణ్యత లేని కిరాణా సామగ్రి వాడుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. కూరలు కూడా ఉడకడం లేదని ఒక్కోసారి పురుగులు కూడా ఉంటున్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీంతో చేసేదేమీ లేక ఎన్నిసార్లు ఫిర్యాదులు అందించినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంటి వద్ద నుంచే భోజనం పంపిస్తున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వాహకులను మార్చి ప్రభుత్వం చెబుతున్నట్లుగా పౌష్టికాహారం రుచిగా శుభ్రంగా వడ్డించాలని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిర్వాహకులను మార్చాలి



గత కొన్నేళ్లుగా భోజనం బాగుండడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. నిర్వాహకులను మార్చాలని గతంలో అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. భోజనం సరిగా లేక విద్యార్థులు పస్తులతో విద్యను అభ్యసిస్తున్నారు. అధికారులు పాఠశాలపై దృష్టి పెట్టి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలి.

– కట్టా తిరుమల, విద్యాకమిటీ చైర్మన్

అధికారులు పట్టించుకోవడం లేదు



ఉడికీ ఉడకని కూరలు వండి పెట్టడం వల్ల విద్యార్థులు పాఠశాలలో భోజనం చేయడం లేదు. గతంలో ఈ సమస్య దృష్టికి వచ్చింది. ఈ రోజు పాఠశాలకు వెళ్లి పరిశీలించాం. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. విద్యార్థుల భోజనాన్ని కూడా రాజకీయం చేయాలని చూస్తున్నారు.

– జిల్లెల బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ, భట్లపాలిక

మహిళల రక్షణ కోసం యువకుల పాదయాత్ర



ద్వారపూడికి చేరుకున్న యువకులు

మండపేట: దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని, ఆడబిడ్డలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ విజయవాడ నుంచి కోల్‌కత్తాలోని భద్రకాళీ అమ్మవారి ఆలయం వరకూ కొందరు యువకులు పాదయాత్ర చేపట్టారు. అనంతపురం, హైదరాబాద్, అన్నవరం ప్రాంతాలకు చెందిన ప్రదీప్ కుమార్, దొంత రాధాకృష్ణ, ఆకేటి సూరిబాబు ఈ నెల 21న విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మహిళల రక్షణ కోసం చేపట్టిన వారి యాత్ర బుధవారం ద్వారపూడి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. యువకుల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తాము ఈ యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. దేశంలో మహిళల, ఆడపిల్లలకు రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు చేసి దారుణాలకు ఒడిగట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.